

నవభూమి

పాలమూరు

అనుబంధం

03 మే,2025 శనివారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


## పాలమూరు ప్రాజెక్టులపై

# బీఆర్ఎస్ నిర్లక్ష్యం



**రేవల్లి, నవభూమి:-** గడి చిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి పాలమూ రు జిల్లా ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహించిందని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షు డు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో పర్యటించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రధాన భాగమైన విద్యుత్ ప్యానెల్ బోర్డు, ప్రాజెక్టు సబ్ స్టేషన్, మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం పంపు హౌస్, నార్లాపూర్ రిజర్వాయర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ 3లో హెడ్ రెగ్యులేటర్, ఏదుల రిజర్వాయర్ పంప్‌హౌస్, నార్లపూర్ లో హెడ్‌వర్క్స్, తీగలపల్లి, వట్టెంలల్లో పంపుహౌజ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల సమస్యలు పరిష్కరించడానికి క్షేత్రస్థాయి లో పరిశీలిస్తున్నామని తెలిపారు. మార్చి లోగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేస్తామని హా మీ ఇచ్చారు. మరో ఆరు నెలల్లో పాలమూరు రంగారెడ్డి ప్రా జెక్టులో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ ఏదుల వట్టెం, కర్వెన ఈ నాలుగు రిజర్వాయర్లలో 50 టీఎంసీల నీరు నింపడానికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా ఉదండాపూర్ రిజ ర్వాయర్ నింపడానికి కావాల్సిన ప్రణాళిక చేపట్టినట్లు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులను 2026 మార్చి 31 లోపు 100 శాతం పూర్తి చేయడానికి సమీక్షిస్తున్నట్లు ఆయన స్ప ష్టం చేశారు. అదే విధంగా ఎంజీఎల్ఐ ప్రాజెక్టులో ని రుపయోగంగా ఉన్న రెండు మోటార్లను మూడు నెల ల్లో మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామన్నా రు. గత ప్రభుత్వం కేవలం హంగు ఆర్భాటాలకు ప్రా? దాన్యమిచ్చిందని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రధాన భాగమైన విద్యుత్ పవర్ పాయింట్ పూర్తి కా నిదే ప్రారంభోత్సవాలు ఎలా చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కు సంబంధించి విద్యుత్ శాఖకు రూ.262 కోట్లు మం జూరు చేశామని, అన్ని పంపింగ్ స్టేషన్లకు అన్ని విధా లుగా పనులు పూర్తి చేయడానికి నిధులు వెచ్చిస్తున్న ట్లు మంత్రి వెల్లడించారు. తప్పనిసరిగా ఉమ్మడి పాల మూరు జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగు అందిస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆందోళన చెందవద్దని నల్గొండ జిల్లాకు అవస రమైన 0.5టీఎంసీల నీటిని అదనంగా కృష్ణానది వరద జలాల నుంచి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఎస్ఎల్ బీసీ దుర్ఘటన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ర కాలుగా స్పందించి అంతుచిక్కని కార్మికుల ఆచూకీ గు రించి పూర్తిస్థాయిలో అన్ని విభాగాలకు చెందిన దాదా పు 700మందినిరంగంలోకి దించినప్పటికీ ఆరుగురు కా ర్మికుల ఆచూకీ ఇప్పటి వరకు చిక్కకపోవడం పట్ల ప్ర భుత్వం విచారం వ్యక్తం చేస్తుందని వారందరీ కుటుం బాలకు ఒక్కొక్కరికి 25లక్షల రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. జువాలజీకల్ సర్వే ఆఫ్ ఇండియాతో పాటు 8 విభా గాలకు చెందిన వారందరితో ముందు చేపట్టాల్సిన సహాయక చర్యలపై నిపుణుల కమిటీని వేశామని వారు నివేదిక అందించిన తర్వాత సహాయక చర్యలను ముందుకు కొనసాగిస్తామని చెప్పారు. అదే విధంగా వనపర్తి జిల్లాలోని ఏదుల పేజ్ టు రిజర్వా యర్లను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా వన పర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎస్పీ రావు ల గిరిధర్ మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్ర మంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్సీ దామో దర్‌రెడ్డి, ఎస్పీ రఘునాథ్ గైక్వాడ్, ఉమ్మడి జిల్లా డీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఈఎన్సీ అనిల్ కుమార్, డీఎ స్పీ శ్రీనివాస్ యాదవ్, ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు పేరు వస్తుందని పాలమూరు ప్రాజెక్టును

# పక్కన పెట్టారు



**తిమ్మాజిపేట నవభూమి:-** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి కావడంతో అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును పక్కన పెట్టిందని బీఆర్ఎస్ నాయకుల ఆరోపించారు. బుధవారం తిమ్మాయిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్ మాట్లాడారు. వలసల జిల్లా పాలమూరులో రైతాంగాన్ని ఆదుకునేందుకు మాజీ సీఎం కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. ప్రాజెక్టులో రిజర్వాయర్లను కాల్వలను, టన్నెళ్లను పూర్తి చేశారని, అయితే 10 శాతం పనులు మిగిలి ఉండగానే ప్రభుత్వం మారడంతో పూర్తి చేయలేకపోయారన్నారు. నల్లమల్ల బిడ్డను చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి కావాలనే ప్రాజెక్టును పక్కన పెట్టారని, 16 నెలలకాలంగా తట్టెడు మట్టి కూడా తీయలేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రస్తావించడంతో ప్రభుత్వంలో కదలిక వరంగల్ బహిరంగ సభలో పాలమూరు ప్రాజెక్టును మాజీ సీఎం కేసీఆర్ ప్రస్తావించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. ఆదర బాదరగా మంత్రి హెలికాప్టర్లో విహార యాత్రకు వచ్చినట్లు వచ్చారని విమర్శించారు. ప్రాజెక్టుపై చిత్తశుద్ధి ఉంటే, ఇక్కడే కూర్చుని పూర్తి చేయాలన్నారు. గతంలో అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు ప్రాజెక్టుల పూర్తి కోసం అక్కడే రాత్రి, పగలు తేడా లేకుండా కూర్చునేవారని గుర్తు చేశారు. కేవలం ఒక్కరోజు వచ్చి సమీక్ష చేస్తే ప్రాజెక్టు పూర్తి కాదని, ఇక్కడే కూర్చుని యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాలన్నారు. కాంగ్రెస్ మంత్రులకు హెలికాప్టర్లో తిరగడం పై ఉన్న ఉత్సాహం పాలనలో లేదన్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తూ, కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టును పూర్తి చేయకుంటే, చూస్తూ ఊరుకోబోమని రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, తారా సింగ్, వెంకటేష్, సైఫుద్దీన్, ప్రశాంత్, సలావుద్దీన్, నాగయ్య, శివ, ఇబ్రహీం, నవీన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల శ్రమతోనే అందరికీ ఆరోగ్యం



2

# అధికార హస్తం..

# గులాబీ సాయం



2

## మే డే సందర్భంగా వెల్దండలో ఎంప్లాయిస్ యూనియన్ భారీ ర్యాలీ



**వెల్దండ నవభూమి:-** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెల్దండ సెక్షన్ నాయకులు బంగారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెల్దండ మండల కేంద్రంలో యూనియన్ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా ముఖ్యఅతిథిగా పాల్గొని 1104 యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1104 యూనియన్ అతిపెద్ద యూనియన్ గా అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామ్ చందర్ నాయక్, డివిజన్ అధ్యక్షుడు విజయభాస్కర్, సబ్ డివిజన్ అధ్యక్షుడు నర్సిరెడ్డి, కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, వెల్దండ సెక్షన్ కార్మికులు విక్రమ్ రెడ్డి, కృష్ణయ్య, యాదయ్య,,శ్రీను, సాంబశివుడు, లస్కర్, మాధవులు, లక్ష్మణ్, వెంకటపతి, రవీందర్, సాంబశివుడు, మల్లేష్ యాదగిరి, నాగేష్, కృష్ణారెడ్డి, కృష్ణయ్య , అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ



**అచ్చంపేట నవభూమి:-** వేసవిలో నిర్వహిస్తున్న నృత్య, సంగీత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ లెక్చరర్ ఫోరం స్టేట్ ప్రెసిడెంట్ యం.రామకృష్ణ సూచించారు. స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో స్థానిక న్యూ ఎక్సీడ్ స్కూల్‌లో వేసవి నృత్య, సంగీత శిక్షణాశిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు వృధా చేయకుండా శారీరక దృఢత్వం, సృజనాత్మకత, మానసిక ఉల్లాసాన్ని కలిగించే శిబిరంలో చేరాలని కోరారు. నెలరోజుల పాటు జరిగే ఈ శిబిరంలో కూచిపూడి, జానపద నృత్యాలతో పాటు లలిత, జానపద, సంగీతం , సంగీత వాయిద్యాల్లో శిక్షణ ఉంటుందని వివరించారు. ముగింపు ఉత్సవాలలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారని, ఆసక్తి కలిగిన విద్యార్థులు శిబిరంలో చేరాలని సంస్థ డైరెక్టర్, డాన్స్ మాస్టర్ నారోజు మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల కళాకారులు టి. రఘుపతి , అంజి మాస్టర్, రాజు మాస్టర్ , చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన అంగన్‌వాడీలు

**గద్వాల నవభూమి:-** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం అంగన్ వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఇందిరమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని శాలు వా, పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞత లు తెలిపారు. అంగన్‌వాడీ పాఠశాలలకు మే నెలంతా సెలవులు ప్రకటించడం తో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్కతో పాటు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 30ఏళ్ల చరిత్రలో మొదటిసారి చిన్నపిల్ల ల దృష్ట్యా ఎండలు ఎక్కువగా ఉండటంతో ఈ సెలవులు ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియ న్ కార్యదర్శి వెంకటరమమ్మ, సభ్యులు శాంతి, లక్ష్మి, రేణుక, శ్రీదేవి, సమయిర బేగం, శోభ తదితరులు ఉన్నారు.

## అధికార హస్తం..

# గులాబీ సాయం

**మహబూబ్‌నగర్, నవభూమి:-** అక్ర మ లేదా సక్రమ పనుల్లో సాధారణంగా ఏ నియోజకవ ర్గంలోనైనా అధికార పార్టీ నాయకులదే పైచేయి ఉంటుం ది. వారి కనుసన్నల్లోనే దందాలు నడుస్తాయి.. ఏదైనా స మస్యలు వచ్చినప్పుడు వారికి అధినేత అభయహస్తం ఉం టుంది. కానీ నారాయణపేట జిల్లా మక్తల్ నియోజక వర్గంలో వింత పోకడలు కనిపిస్తున్నాయి. తమ పేర్లు బ యటకు రాకుండా ఉండటం కోసం అధికార పార్టీ నాయ కులే ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులను దందాలో చేర్చుకు ని పనులు చక్కబెట్టుకుంటున్న పరిస్థితులు ఏర్పడుతు న్నాయి. ఇది చూసిన కొంతమంది హస్తం కార్యకర్తలు కూడా ముక్కున వేలేసుకుంటున్నారు. కృష్ణానదిలో పైన ఉన్న భూములన్నీ నల్లరేగడి కావడంతో ఇక్కడ ఇసుక లభ్యత దాదాపు ఉండదు. కానీ నది పాయలుగా విడిపో యిన చోట, వేరే ఉపనదులు వచ్చి కలిసిన ప్రాంతాల్లో మాత్రం ఇసుక లభ్యత ఉంది. నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గుడెబల్లూరు- ముడుమాల్ శివారులో మాత్రం ఇసుక లభ్యత భారీగానే ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న నాయకులు గత ప్రభుత్వం నుంచే ఇసుక దందా నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వ చ్చిన తర్వాత కొద్దిరోజులు దందా ఆగినా.. ప్రస్తుతం య థేచ్ఛగా నడుస్తోంది. అర్ధరాత్రి వేళల్లో కర్ణాటకలోని వివిధ ప్రాంతాలతో పాటు మక్తల్, నారాయణపేట, కృష్ణ, మాగ నూరు మండలాలకు కూడా అక్రమంగా రవాణా చేస్తు న్నారు. వాస్తవానికి ఇక్కడ రీచ్ పెట్టి ఇసుక తవ్వకాలు చేపడితే ప్రభుత్వానికి ఆదాయమైనా వచ్చేది.. కానీ ఇప్పు డు ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతున్నా.. తమ దృష్టికి రాలేదని చెప్పి తప్పించుకుంటున్నారు. ఫొటోలతో పాటు వాస్తవాలు బయటపడుతున్నా.. కళ్లు ఉండీ కబోదిలా అధికారుల వ్యవహారశైలి ఉంటోంది. దందా జరుగుతోందిలా...కర్ణాటక నుంచి వచ్చే కృష్ణానది.. మహారాష్ట్ర నుంచి వచ్చే భీమా నది నారాయణపేట జిల్లా తంగిడిగి దత్త భీమేశ్వ రస్వామి ఆలయం వద్ద సంగమమవుతాయి. ఈ క్రమంలో కుసుమూర్తి, గురుజాల్, హిందూపూర్, గు డెబల్లూరు, ముడుమాల్ శివారుల్లో ఇసుక మేటలు ఏర్ప డతాయి. గుడెబల్లూరు- ముడుమాల్ శివారులోని ముర హర్ దొడ్డి వెళ్లే మార్గం దగ్గర ఓంకారేశ్వర మఠం, మణి కంఠ ఎత్తిపోతల పైభాగంలో ఇసుక



తవ్వకాలు యథేచ్ఛ గా కొనసాగుతున్నాయి. నదిలోకి టిప్పర్లు వెళ్లేందుకు సిమెంట్‌పైపులైన్లు వేసి.. కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు నిర్మించారు. ఆ మట్టి రోడ్డుపై టిప్పర్లు, హిటాచీలు రోజూ తిరుగుతూ ఇసుక తవ్వకాలు చేసి.. రవాణా చేస్తున్నాయి. కర్ణాటక నుంచి వస్తున్న టిప్పర్లు రోజుకు 50 నుంచి 60 ట్రిప్పులు ఇక్కడ నుంచి ఇసుకను తరలిస్తున్నాయి. గతంలో స్థానికంగా ఉన్న ఓ మండల నాయకుడి టిప్పర్లు మాత్రమే నడిచేవి. అయితే కర్ణాటకలోని గుర్మిట్కల్ నాయకుడు ఒకరు ఇక్కడి టిప్పర్లను రానివ్వకపోవడంతో అక్కడి నుంచే రోజూ రాత్రి టిప్పర్లు నదిలోకి దిగుతున్నాయి. స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన హిటాచీ ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ. 25వేల నుంచి రూ. 30వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి కర్ణాటకలోని రాయచూరు, కడైచూర్ ఇండస్ట్రీయల్ ఏరియా, సైదాపూర్, గుల్బర్గా వరకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే స్థానికంగా కృష్ణ, మాగనూర్, నారాయణపేట, మక్తల్ పట్టణాలకు కూడా ఇసుకను తరలిస్తున్నారు. టిప్పర్లు వెళ్లి రోడ్లు పాడవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. పాత- కొత్త నాయకుల పంచాయితీ...! ఈ ఇసుక అక్రమ రవాణా పాత, కొత్త నాయకుల మధ్య పంచాయితీలకు దారితీసి విభేదాలకు ఆజ్యం పోస్తోంది. గతంలో బీజేపీలో ఉండి, తర్వాత బీఆర్ఎస్‌లో చేరి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందులో చేరి.. కృష్ణ మండలంలోని ఓ నాయకుడు ఇసుక దందా చేస్తున్నారు. గతంలో గుడెబల్లూరుకు చెందిన ఒక సెటిలర్, నియోజకవర్గంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇందుకు మద్దతు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఏమైందో కానీ అదే గ్రామానికి చెందిన మరో సెటిలర్, ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్న సీనియర్ నాయకుడు సాయం పొందుతున్నారు. నలుగురు కాంగ్రెస్ లీడర్లు ఇందులో కీలకంగా వ్యవహరిస్తుండగా.. తాజాగా ఓ బీఆర్ఎస్ లీడర్ ఇందులో చేరిపోయారు. గతంలో దందాలో ఉన్న మరో ఇద్దరు కాంగ్రెస్ లీడర్లు దందాకు దూరమయ్యారు. అయితే గులాబీ నాయకుడిని అధికారులతో లాబీయింగ్, మామూళ్లు ముట్టజెప్పేందుకు కీలకంగా వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇసుక దందా చేసే వ్యక్తి బీఆర్ఎస్‌లో ఉండగా.. కేవలం దందా కోసమే కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు కూడా అతడి కనుసన్నల్లోనే దందా నడుస్తుండటంతో కాంగ్రెస్ పార్టీలో ఎప్పటి నుంచో ఉన్న సీనియర్ నాయకులు నారాజ్‌లో ఉన్నారు. ఈ ఇసుక రవాణాను నియోజకవర్గ పెద్ద మనుషులే ఆపరేట్ చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైకి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తామని చెబుతున్నప్పటికీ.. తమకు చెడ్డపేరు రాకుండా బీఆర్ఎస్ నాయకులతోనే ఈ దందా చేయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక మాజీ వైస్ ఎంపీపీ, ఒక మాజీ ఎంపీటీసీ, ఇద్దరు స్థానిక నాయకులు, ఒక బీఆర్ఎస్ నాయకుడు కీలకంగా ఉండటంతో విభేదాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. జెండా పట్టి తిరిగిన వారిని కాదని, అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరిన వారిని ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో తూగుతూ తమకేం తెలియదని బుకాయించుకుంటూ వస్తున్నారు. వాస్తవాలు వెలుగులోకి వస్తున్నా పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు.

## కార్మికుల శ్రమతోనే అందరికీ ఆరోగ్యం

**జడ్చర్ల, నవభూమి:-** కార్మికుల శ్రమతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటున్నారని, పారిశుధ్యం లోపిస్తే అనారోగ్యం పాలవుతారని జడ్చర్ల ఎమ్మెల్యే జ నుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే క్యాం పు కార్యాలయంలో బుధవారం మే డే సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు పనిచేయని పక్షంలో పరిసరాలన్ని అపరిశు భ్రంగా మారుతాయన్నారు. కార్మికుల శ్రమ ఎంతో కష్టతరమైందన్నారు. మే డే సందర్భంగా కార్మికులకు తన స్వంత నిధులతో మహిళా కార్మికులకు చీరలు, పురుష కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. అ నంతరం కార్మికులతో సహపంక్తి భోజనం చేశారు. తెలంగాణ రాష్ట్ర సంగీ త, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్, జడ్చర్ల మునిసి పల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జనార్ధన్‌రెడ్డి, బుక్క వెంకటేశ్, మినాజ్‌లతో పాటు కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యుదాఘాతంతో తల్లీకొడుకుల మృతి



**తాడూరు, నవభూమి:-** విద్యుదాఘాతంతో ఒకే కుటుంబానికి చెందిన తల్లీకొడుకులు మృతి చెందిన ఘటన తాడూరు మండలంలోని తుమ్మలసూగూరులో గురువారం ఉదయం చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలసూగూరు గ్రామానికి చెందిన శ్రీనివాసాచారి కుమారుడు అయిన శ్రీకాంత్(16) ఉదయం 10 గంటల సమయంలో ఇంటి వద్ద ఉన్న పిండిగిర్నిని ఆన్‌చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో శ్రీకాంత్ ప్రాణాపాయ స్థితిలో కొట్టుకుంటుండగా గమనించిన తల్లి జయమ్మ(42)కాపాడేందుకు ప్రయత్నిస్తూ ఇద్దరు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ సమయంలో జయమ్మ కూతురు పక్కనే ఉన్నప్పటికీ ఏం చేయాలో పాలుపోక వెంటనే విద్యుత్ సరఫరా అయ్యే స్విచ్‌ను ఆపివేసింది. వెంటనే వారి వద్దకు వెళ్లి చూసి అంబులెన్స్‌కు సమాచారవివ్వగా అంబులెన్స్ వచ్చేలోపే జయమ్మ మృతి చెందగా శ్రీకాంత్ కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నాడు. జయమ్మ మృతదేహంతోపాటు శ్రీకాంత్‌ను 108లో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరిశీలించిన డాక్టర్లు అప్పటికే ఇద్దరు మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీనివాసాచారి కూలినాలీ చేస్తూ కుటుంబాన్ని వెల్లదీస్తుండగా జయమ్మ ఇంటి వద్దనే ఉంటూ టైలర్ పని చేస్తూ పిండిగిర్ని నడుపుతూ కుటుంబాన్ని పోషించేదని సమాచారం. జయమ్మ భర్త శ్రీనివాసాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అయితే విద్యుదాఘాతంతో మృతి చెందిన జయమ్మ, శ్రీకాంత్ భౌతికకాయాలను ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# గన్నీ బ్యాగులు అందించకపోతే వరి ధాన్యం ఎట్లా అమ్ముకోవాలి



**ఊట్కూర్ నవభూమి:-** రైతులకు సరిపడు గన్నీ బ్యాగులను సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం రైతు వేదిక వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద వరి ధాన్యం కొనుగోలు చేపట్టేందుకు రైతులకు 10 రోజుల క్రితం సిబ్బంది టోకెన్లు అందించారు. ధాన్యం నింపేందుకు గన్నీ బ్యాగులు అందించకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం మండలంలోని పెద్దజట్రం, బిజ్వారం, అవుసలోనిపల్లి గ్రామాల్లో రైతులు రైతు వేదిక వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. వ్యవసాయ శాఖ ఏఈఓ స్వప్న, పీఏసీఎస్ ఇన్‌చార్జి విద్యాసాగర్ గౌడ్ కు సమాచారం ఇచ్చిన స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను పట్టించుకోవడంలేదని, తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులకు రైతుల కష్టాలు కానరావడం లేదని ఆరోపించారు. అకాల వర్షాలతో కల్లాల వద్ద ధాన్యం తడిసిపోకుండా ఎంతకాలం జాగ్రత్తలు తీసుకోవాలని ప్రశ్నించారు. రైతులకు మద్దతుగా భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కాంత్, రైతులు నాగరాజు, రాము, సురేందర్ రెడ్డి, నీరటి తిరుపతి, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

**మహబూబ్ నగర్ నవభూమి:-** వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టంలో రైతుల వివరాలు వెంటనే నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోటకద్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అప్పాయపల్లి వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ ( %బాబుఎవఅ ఎఱఅఱ్% ) చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు. సరైన తేమ శాతం, నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన మిల్లుకు పంపించాలని ఆదేశించారు.

# హక్కులను సాధించుకున్న దినమే మేడే




**ధన్వాడ, నవభూమి:-** అమెరికా దేశంలోని చికాగోలో 1986 మే 3న రోజుకు ఎనిమిది గంటలు పనిదినాల కోసం కార్మికులు హక్కులను పోరాడి సాధించుకున్న దినమే మేడే అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ అన్నారు. గురువారం నారాయణపేట మునిసిపల్ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా ఆయన సీఐటీయూ జెండావిష్కరణ చేశారు. అనంతరం కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. మన దేశంలో స్వాతం త్ర్యం పూర్వం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం సవరించి నాలుగు కార్మిక కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చారని దీనివల్ల కార్మికులు మరోసారి బానిసత్వంలోకి నెట్టబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిద్దామన్నారు. మేడే స్ఫూర్తితో ఎనిమిది గంటల పనిదినాన్ని కాపాడుకుందామన్నారు. అనంతరం పురవీధుల గుండా కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సౌభాగ్య, సాయిలు, అరుణ, రాంలింగమ్మ తదితరులున్నారు. జిల్లా వ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరుపుకు న్నారు. అదేవిధంగా, ఊట్కూర్‌లో మాస్‌లైన్ పార్టీ, టీయూసీఐ, సీఐటీయూ, భవన నిర్మాణ, గ్రామ పంచాయతీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గ్రామగ్రామాన కార్మికులు ఎర్రజెండాను ఆవిష్కరించి, జేజేలు పలికారు. బిజ్వార్‌లో మాస్‌లైన్ పార్టీ గ్రామ కార్యదర్శి సిద్దు, ఊట్కూర్, అవుసులోన్ పల్లి గ్రామాల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు చెన్నప్ప, పెద్దపొర్ల గ్రామంలో టీయూసీఐ నాయకుడు చిన్నబాలు, వల్లంపల్లిలో హన్మంతు, పగిడిమారిలో భీంరావు, అమీన్‌పూర్‌లో పెద్ద శంకరప్ప, పెద్దజట్రం గ్రామంలో నాగప్ప, కొత్తపల్లి గ్రామంలో రామాంజనేయులు జెండాను ఆవ్కిరించారు. ఈ సందర్భంగా కార్మిక హక్కుల కోసం పోరాటం చేస్తామని కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. మాగనూరులో సీఐటీయూ జెండాను నాయకులు ఆవిష్కరించి, మాట్లాడారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు అశోక్, కార్మికులు హనుమంతు, ఆరిఫ్, ఖాసీం ఉన్నారు. కోస్గిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మునిసిపల్ కార్మికులు మేడే సందర్భంగా జెండాను ఎగురవేశారు. కార్మికులు నారాయణ, కనకప్ప, రాములు, కృష్ణ తదితరులున్నారు. గుండుమాల్ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో ప్రజా ఉద్యమ నాయకుడు కృష్ణమౌర్య ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు కార్మిక జెండాను ఎగురవేసి మేడే దినోత్సవ ప్రత్యేకతను చాటి చెప్పారు. కార్యక్రమంలో నర్సిములు, జంగయ్య, కృష్ణ, శివకుమార్, రాములు, కృష్ణయ్య, సాయప్ప తదితరులున్నారు. మరికల్‌లో భవన, హమాలీ కార్మికులు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు సీఐటీయూ జిల్లా నాయకుడు నరహరి ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు మేడే జెండాను ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సూరిటి గోపి, కుర్మన్న, హమాలీ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. దామరగిద్దలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు పెద్దింటి రామకృష్ణ పార్టీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి జెండావిష్కరణ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకురాలు అంజిలమ్మ జెండా ఆవిష్కరణ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ మాట్లాడారు. సీఐటీయూ మండల కార్యదర్శి జోషి, అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, ఈశ్వరమ్మ, నాగమ్మ, కార్మికులు పాల్గొన్నారు. కొత్తపల్లి మండలం భూనీడు చౌరస్తాలో టీయూసీఐ నాయకులు కార్మిక జెండాను ఎగురవే శారు. జిల్లా కార్యదర్శి నర్సింహ, కొండప్ప, మ హిపాల్, హన్మంతు, గోవర్దన్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. మద్దూర్‌లోని పెదిరిపాడ్ చౌరస్తాలో సీఐటీయూ జెండాను జిల్లా నాయకురాలు శశికళ ఆవిష్కరించారు. జిల్లా నాయకుడు మహ్మద్‌అలీ, కమిటీ సభ్యుడు అశోక్ హాజరై, మాట్లాడారు. కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు. కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని టైరోడ్డు వద్ద టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ. బుట్టో గురువారం జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం, మెకానిక్ సంఘం, భగీరథ కార్మికులు పాల్గొన్నారు. మక్తల్ మునిసిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించి, మేడే జెండాను ఆవిష్కరించారు. సీఐ టీయూ జిల్లా కార్యదర్శి గోవిందరాజు, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ మాట్లాడారు. మునిసిపల్ కార్యాలయంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం ఆధ్వర్యంలో 70 మంది కార్మికులను సన్మానించారు. మునిసిపల్, అంగన్ వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. మక్తల్ మండలం చిట్యాల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులను గ్రామ యువకులు, పెద్దలు సన్మానించారు. కాంగ్రెస్ నాయకుడు అశోక్, గ్రామ యువకులు ఆంజనేయులు, మెకానిక్ బాబు, మెకానిక్ వెంకటేష్, అంజి, రాము, గణేష్, కథలప్ప, పెద్దలు పాల్గొన్నారు. ధన్వాడలో గురువారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక రహదారిపై కార్మిక జెండాను ఎగురవేశారు. అంతకుముందు గ్రామంలో కార్మి కులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకుడు వెంకటేష్, పంచాయతీ సిబ్బంది బాలకృష్ణ, భాను, ఇమ్రాన్, రమేష్ తదితరులున్నారు.

## జిల్లాను విద్యాపరంగా

# ముందు వరుసలో ఉంచుదాం

**నారాయణపేట నవభూమి:-** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నారాయణపేట జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించ డంపై ఆనందం వ్యక్తం చేస్తూ పీఆర్టీయూటీఎస్ నారాయణపేట జిల్లా శాఖ కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు లును కలెక్టర్ కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపి, మిఠాయిలు పంపిణీ చేశారు. అలాగే, సంఘం నుంచి డీఈవో ద్వారా నోటు పుస్తకాలు, పెన్నులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయులు చక్కగా పని చేసి ఉత్తమ ఫలితాలు తీసుకురావడం పట్ల విద్యాశాఖకు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే విద్యా సంవ త్సరం నుంచి ఇంకా మంచి ఫలితం కోసం కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయ బృందం సీ, డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసు కోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో మధ్యాహ్న భోజనం కోఆర్డినేటర్ యాదయ్యశెట్టి, దామరగిద్ద ఎంఈవో కృష్ణారెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వై. జనార్ధన్‌రెడ్డి, నారాయణపేట మండల అధ్యక్షుడు రఘువీర్, పట్టణ ప్రధాన కార్యదర్శి జహీరొద్దీన్, పీఆర్టీయూ జిల్లా, రాష్ట్ర బాధ్యులు ప్రకాష్, నర్సింగ్ రావు, నరేందర్, అమృత, తిప్పన్న, ప్రసాద్‌రావు తదితరులున్నారు.



## ధాన్యం కొనుగోలు చేస్తారా..? లేదా?



**మాగనూరు, నవభూమి:-** మాగనూరు కృష్ణ ఉమ్మడి మండలాల్లో రైస్ మిల్లులకు వరి ధాన్యం రెండు నుంచి 5వేల క్వింటాళ్ల వరకు తీసుకోవాలని అ ధికారులు ఎందుకు ఆంక్షలు విధిస్తున్నారు.. అసలు రైతుల దగ్గర వరి ధాన్యం కొనాలనుకుంటున్నారా లేదా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్వాట్ గేట్ సమీపంలోని వైష్ణవి రైస్‌మిల్ దగ్గర రైతులు మూడు రోజులుగా సొంత వాహనాలు, కిరాయి వా హనాలతో పడిగాపులు కాసినా రైతులు వడ్లు కొనుగోలు చేసే సమయానికి మిల్లు క్వాంటిటీ అయిపోయిందని చెప్పారు. అంతేకాకుండా కొంతమంది రై తుల దగ్గర ప్రభుత్వానికి విరుద్ధంగా మూడు కిలోల తరుగు తీసుకుంటాం.. అట్లయితే వడ్లు కొంటాం లేకపోతే మిగతా రైతులు వేరే రైస్ మిల్లు దగ్గర వెళ్లి వడ్లు అమ్ముకోవాలని అనడంతో అప్పటికే విసుగు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం వడ్వాట్ గేటు సమీపంలోని ఎన్‌హెచ్ 167పై గంటపాటు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రై తులు మాట్లాడుతూ వరి ధాన్యం కొనాలంటే రైతు లు నష్టపోవాలా నష్టపోతేనే వరి ధాన్యం అమ్ముకోవాలంటే రైతులకు అధికారులు ఏం న్యాయం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. మిల్లుల వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో మిల్లుల యజమానుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మం డిపడ్డారు. రైతుల ఆందోళనతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ, ఎస్సైలు అక్కడికి చేరుకొని రైతులను బెదిరించేందుకు ప్రయత్నించినా వారు వినిపించుకోలేదు. దీంతో వ్యవసాయాధికారులను పిలిపించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయధికారి సుదర్శన్‌గౌడ్ జిల్లా అధికారులతో మాట్లాడా రు. వైష్ణవి రైస్ మిల్ యజమానితో ధాన్యం కొనేలా చర్యలు తీసుకోవాలని చెప్పడంతో అప్పటికప్పుడు ప్రస్తుతానికి 3వేల బస్తాలు తీసుకోవాలని రైస్‌మిల్ యజమానిని ఒప్పించడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, జనసేన, బీజే పీ నాయకులు, వివిధ గ్రామాల రైతులున్నారు.

## కార్మికుల శ్రేయస్సుకు బీఆర్ఎస్ కృషి

**జడ్చర్లటౌన్, నవభూమి:-** కార్మికుల శ్రేయస్సు కోసం బీఆర్ఎస్ పనిచేస్తోందని మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అ న్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్టీయూ ఆధ్వర్యంలో గురువారం జడ్చర్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొని బీఆర్టీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతికి కేసీఆర్ కృషి చేశారన్నారు. బీఆర్ఎస్ పాలనలో కార్మిక సంక్షేమ పథకాలను తెచ్చి కార్మికుల జీవితాల్లో వెలుగునింపారన్నారు. ఉద్యోగులు, కార్మికుల జీతభత్యాలను పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆ రోపించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కార్మికులందరూ సంఘటితమై పోరాటం చేయాలని, కార్మికులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందన్నారు. అదే విధంగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఆ తర్వాత నేతాజీచౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్టీయూ, బీఆర్ఎస్ నాయకులు జెడ్పీమాజీ వైస్ చైర్మన్ యాదయ్య, మురళి, రఘుపతిరెడ్డి, చాంద్‌ఖాన్, శ్రీనివాస్‌యాదవ్, ప్రణీల్‌చందర్, రామ్మోహన్, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, కొండల్, ఇంతియాజ్, సతీశ్‌తోపాటు వివిధ సం ఘాల నాయకులు పాల్గొన్నారు.



# ముగ్గురిని మింగిన చెరువు



**పెద్దకొత్తపల్లి, నవభూమి:-** ముక్కుపచ్చలారని ముగ్గురు చిన్నారులను చెరువు బలి తీసుకున్న ఘటన పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ది. వేసవి సెలవు లు ఇచ్చారనే ఆనందంలో పెద్దకొత్తపల్లి మండల కేం దానికి చెందిన ఏడుగురు చిన్నారులు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఈతకు వెళ్లారు. అయితే చెరువు నిండుగా ఉండడంతోపాటు చెరువులో గుంతలు ఉండడం వల్ల ఏడుగురు విద్యార్థుల్లో సుధాకర్, రాధ దంపతుల కుమారుడు శ్రావణ్(7), ధర్మారెడ్డి కుమారుడు గణేశ్‌రెడ్డి (13), కుమార్తె రక్షిత(10) చెరువు లోకి దిగడంతో నీళ్లలో పూర్తిగా మునిగిపోయారు. మునిగిపోతూ పిల్లలు చేస్తున్న ఆర్థనాదాలు విని భయభ్రాంతులకు గురైన మిగిలిన నలుగురు పిల్లలు చెరువు నుంచి బ యటికి పరుగులు తీశారు. చెరువు సమీపంలోనే ప శువులను మేపుతున్న ఓ వ్యక్తి గమనించి పిల్లలను ఆపి ఆరా తీయగా విషయం చెప్పారు. సదరు వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసు లు వచ్చే లోపు ముగ్గురు పిల్లలు నీళ్లలో మునిగిపోయారు. వెంటనే గజ ఈతగాళ్లతో చెరువు లో మునిగిపోయిన విద్యార్థులను బ యటకు తీసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. మృతి చెం దిన చిన్నారులు గణేశ్‌రెడ్డి, రక్షితల తల్లి కొన్నేండ్ల కిందట మృతిచెందింది. దీవతో ధర్మారె డ్డి ఇద్దరు పిల్లలను హైదరాబాద్‌లోని బండ్లగూడలో సరస్వతీ శిశు మందిర్‌లో చదివిస్తున్నాడు. పాఠశాలకు సెలవులు రావడంతో ఈ మధ్యనే వారు ఇంటికి వచ్చి ఆటపాటలతో సంతోషంగా గడుపుతున్న పిల్లలు కళ్లముందే శాశ్వతంగా దూరం కావడంతో ధర్మారెడ్డి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మృతిచెందిన మరో బాలుడు శ్రావణ్‌కుమార్ తల్లిదండ్రులు సుధాకర్, రాధ రెక్కల క ష్టంపై ఆధారపడి జీవనం గడిపేవారు. చిన్నచిన్న ప నులకు ఆసరాగా ఉంటున్న కుమారుడు మృతి చెం దడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. ముగ్గు రు విద్యార్థులు మృత్యువాత పడడంతో బాధిత కు టుంబ సభ్యుల ఆర్థనాదాలు అందరినీ కంటతడి పె ట్టించాయి. చిన్నారుల మృతదేహాలను పోస్టుమా ర్టం నిమిత్తం నాగర్‌కర్నూల్‌కు తరలించారు. కాగా, శ్రావణ్ 2వ తరగతి, గణేశ్‌రెడ్డి 7వ, రక్షిత 5వ తరగతి చదువుతున్నారు.

### పాలమూరు ప్రాజెక్ట్‌కి ద్రోహం చేస్తున్నారు..

# రేవంత్ ప్రభుత్వంపై నిరంజన్ రెడ్డి ఫైర్

**మహబూబ్‌నగర్ నవభూమి:-** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 90 శాతం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పూర్తయిందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. పాలమూరు ప్రాజెక్ట్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. పాలమూరు వారైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్ట్‌కు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఇవాళ(శుక్రవారం) తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్ట్‌లో ఆంధ్రా ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడికి టెండర్ దక్కిందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఆయన పనులను ఎందుకు పూర్తి చేయలేదని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. వాళ్ల అధినాయకుడి ఆజ్ఞలతో జాప్యం చేస్తున్నారా అని నిలదీశారు. నీటి పారుదలశాఖ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్కువ ఖర్చుతో పూర్తి అయ్యే ప్రాజెక్ట్ డిజైన్‌లు మార్చి అంచనాలు పెంచారని ధ్వజమెత్తారు. రేవంత్ ప్రభుత్వం ప్రజాధనం వృథా చేస్తుందని విమర్శించారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ రిపోర్ట్ గెజిట్ నోటిఫై చేయటం కోసం మే 7వ తేదీ సమావేశం ఉందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. ట్రిబ్యునల్ రిపోర్ట్‌లో ఉమ్మడి రాష్ట్రాలకు 1050 టీఎంసీల నీళ్లు కేటాయించినట్టుగా తెలుస్తోందని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు.



బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ రిపోర్టును ప్రభుత్వం యథాతథంగా ఆమోదిస్తే తెలంగాణకు గొడ్డలి పెట్టు అని చెప్పారు. జూరాల ప్రాజెక్టు ద్వారా కొడంగల్ నారాయణపేట లిఫ్ట్‌కు నీళ్లు వచ్చే పరిస్థితి ఉండదని అన్నారు. రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని చెప్పారు. ఈ ఏడాది ధాన్యం ఎంత సేకరించారు...బోనస్ ఎంత ఇచ్చారని ప్రశ్నించారు. అన్ని రంగాల్లో ఈ ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందని అన్నారు. రేవంత్ ప్రభుత్వాన్ని భరించటం రాష్ట్ర ప్రజలకు శిక్ష అని చెప్పారు. కృష్ణా జలాల విషయంలో అనుసరించాల్సిన వ్యూహంపై అఖిల పక్షాన్ని బ్రిజేష్ కుమార్ సమావేశానికి పిలవాలని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి కోరారు.

# కారు,లారీ,డీసీఎం ఢీ

**మూసాపేట, నవభూమి:-** స్కూటీని తప్పించబోయి ఓ కారు ముందు వెళ్తున్న డీసీఎంను ఢీకొన్నది. ఆ కారును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలో బుధవారం ఉదయం ఈ సంఘటన జరిగింది. అడ్డాకుల ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం, సంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి కారులో హైదరాబాద్‌కు బయలు దేరారు. అడ్డాకుల మండలం కందూరు స్టేజీ వద్దనున్న వంతెనపై ముందు వెళ్తున్న డీసీఎంకు ఓ స్కూటీ హఠాత్తుగా అడ్డురావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో దాని వెనుక వస్తున్న కారు డీసీఎంను ఢీకొన్నది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఆ కారును ఢీకొనడంతో నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న శోభారాణి (50) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. అదే కారులో ఉన్న ఎల్లారెడ్డి, విమల, డ్రైవర్ రవీందర్‌తో పాటు స్కూటీపై వస్తున్న కొమిరెడ్డిపల్లికి చెందిన రఘుపతిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా దెబ్బతిన్న కారులో నుంచి క్షతగాత్రులను వెలికి తీసి అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించారు. రఘుపతిరెడ్డి కందూరు సాయిబాబా గుడికి వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు వాహనాలు రహదారికి అడ్డంగా పడటంతో కొద్దిసేపు రాకపోకలకు ఆటంకం కలిగింది. సంఘటనపై కేసు నమోదు చేసుకొని, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



# చేగుంటలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబలి కేంద్రం ప్రారంభం




**తిమ్మాజిపేట నవభూమి:-** తిమ్మాజిపేట మండలం చేగుంట గ్రామంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రముఖ వ్యాపారవేత్త మారేపల్లి సురేందర్ రెడ్డి చేగుంట గేటు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు.గ్రామానికి వచ్చి పోయే వారికి, వృద్ధులకు కోసం అంబలి కేంద్రం ఏర్పాటు చేసినట్లు యువజన సంఘం ప్రతినిధులు గాలి రాజు, గడ్డం చెన్నయ్య తెలిపారు. గేట్ వద్ద అటుగా ప్రయాణికుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిల్లె మల్లయ్య, శ్రీశైలం, వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాగటూరులో అర్ధరాత్రి18 గడ్డివాములు దగ్ధం.. భారీగా నష్టపోయిన రైతులు



**అలంపూర్,నవభూమి:-** ఉండవల్లి మండల పరిధిలోని ప్రాగటూరు గ్రామంలో గురువారం అర్ధ రాత్రి 18 గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన సుమారు పది మంది రైతులకు సంబంధించిన 18 గడ్డివాములు ఒకేసారి అగ్నికి అహుతాయ్యియి. ప్రమాద విషయాన్నీ తెలుసుకున్న అలంపూర్ ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి కురుమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఒక్కో గడ్డివాము సుమారు లక్ష రూపాయల వరకు ఉండవచ్చని సుమారు రూ.20 లక్షల దాకా ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు.సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీఎం నాయకులు ప్రాగటూరు గ్రామంలో గడ్డివాముల దగ్ధమైన విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు రేపల్లె దేవదాసు సంఘటన స్థలాన్ని చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతులను పరామర్శించారు. బాధిత రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేసవి కాలంలో పశుగ్రాసం దొరకక రైతులు ఇబ్బంది పడుతున్న సందర్భాల్లో ఇటువంటి సంఘటన జరగటం చాలా దురదృష్టకరమన్నారు. కుట్రపూరితామా లేదా ప్రమాదవశాత్తు జరిగిందా అనే విషయాన్ని పోలీసులు విచారణ చేపట్టాలన్నారు.

# దోమలపెంటలో చిరుత సంచారం

**అచ్చంపేట, నవభూమి:-** అమ్రాబాద్ మండలం దోమలపెంటలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. వారం రోజుల్లో చిరుత మూడుసార్లు ఆ ప్రదేశాల్లో సంచరిస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దోమలపెంట మాజీ ఉపసర్పంచ్ బుద్దుల ప్రసాద్ ఇంటిముందు నుంచి వెళ్లిన చిరుతపులి కదిలికలు సీసీ కెమెరాలో రికార్డు అయింది. బుధవారం రాత్రి 11గంటల ప్రాంతంలో ఇంటిముందు నుంచి వెళ్లినట్లు ప్రసాద్ తెలిపారు. దోమలపెంట, ఈగలపెంట ప్రాంతాల్లో తరుచూ చిరుతపులి సంచరిస్తుండగా స్థానికులు భయాందోళన చెందుతున్నారు.చిరుతపులి మనుషులపై ఎలాంటి దాడి చేయలేదు. పిల్లులు, కుక్కలను మాయం చేస్తుందని స్థానికులు తెలిపారు. అయితే నిత్యం రాత్రివేళ గ్రామంలో సంచరిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దోమలపెంట, ఈగలపెంట గ్రామాలు అడవిని ఆనుకొని ఉండడంతో చిరుత పలుసార్లు గ్రామంలోకి సంచరిస్తోంది. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత గ్రామంలోకి రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పరిహారం.. పరిహాసమేనా ?



**గద్వాల,నవభూమి:-** పంట నష్ట పరిహారం విషయంలో రైతులకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేస్తే పంట చివరి దశలో అకాల వర్షాలు కురియడంతో రైతులకు అపార నష్టం సంభవించింది. నష్టపోయిన రైతులకు భరోసా కల్పించడంలో అటు అధికారులు, ఇటు పాలకులు విఫలమయ్యారనే చెప్పవచ్చు.పంటనష్టం జరిగిన సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారే తప్పా పరిహారం మాత్రం అందడం లేదు. ఇటు రైతులకు యాసంగికి సంబంధించి రైతు భరోసా అందక, అటు పంట నష్టపరిహారం రాకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో రైతన్నలు ఉన్నారు. ఈ నెలలో వరి, మామిడి, బొప్పాయి తదితర పంటలు చేతికి వచ్చే సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడడంతో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో పంట కోసం చేసిన అప్పులు ఎలా కట్టాలని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.పంట నష్టపరిహారం లెక్కల్లో తేడా..రైతులకు చెల్లించాల్సిన పంట నష్టపరిహార విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తున్నది. ఈ నెల 4వ తేదీన కురిసిన ఈదురు గాలులు వర్ష బీభత్సానికి గద్వాల మండలం కొండపల్లి, శేషంపల్లి గ్రామంలో బొప్పాయి తోట చెట్లు విరిగిపడ్డాయి. సుమారు 80 ఎకరాల్లో నష్టం సంభవించింది. అదే విధంగా వరి, మిరప పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన వరి వర్షానికి నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందారు. సుమారు 200 ఎకరాల్లో అప్పుడు వరి పైరుకు నష్టం వాటిల్లింది.మిరప పంట కోసి కల్లాల్లో ఆరబెట్టగా అకాల వర్షానికి తడిచి ముద్దయిపోయింది. ఈ పంటలకు సంబంధించి పరిహారం రైతులకు ఇప్పటి వరకు రాలేదు. ఆదివారం ఈదురు గాలులుతో కూడిన భారీ వర్షానికి కేటీదొడ్డి మండలం కొండాపురంలో మామిడి కాయలు అన్ని రాలిపోయాయి. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో చేతికి వచ్చిన వరి పైరు నేలవాలింది. ఆదివారం కురిసిన వర్షానికి వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం 294 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది.వీటితోపాటు 35 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిందని, ఇతర పంటలు ఏడు ఎకరాల్లో నష్టం వాటిల్లిందని జిల్లాలో మొత్తం 336 ఎకరాల పంటనష్టం వాటిల్లిందని అంచనా వేశారు. అధికారుల అంచనాకు వాస్తవ పరిస్థితికి చాలా తేడా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కాగా వ్యవసాయశాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లు తడిసిపోయినా, ఆరు బయట ఆరబెట్టిన మిర్చి, పొ గాకు తడిసి పోతే దానిని పంట నష్టపరిహారం కింద అంచనా వేయలేదు. ఈ నెల 4వ తేదీ, 27వ తేదీల్లో కురిసిన భారీ వర్షానికి అన్ని పంటలు కలుపుకొని సుమారు 1,100 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో అదికారుల అంచనాకు రైతులు చెప్పే నష్టానికి పోలికే లేకుండా పోయింది.అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం..పంట నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు పంటనష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తున్నామని చెబుతున్నారని అయితే పరిహారం మాత్రం అందడం లేదని వాపోతున్నారు. ఇటు యాసంగికి సంబంధించి రైతులకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వక, అటు పరిహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుండండతో ప్రభుత్వ తీరుపై రైతులు గుర్రుగా ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారాన్ని అంచనా వేసి రైతులకు త్వరగా పరిహారం అందిచేలా చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# మమ్మల్ని నిండా ముంచేస్తారా?

**మూసాపేట, నవభూమి:-** ధాన్యం కొనుగోలు చేయాలని గురువారం రైతులు ఆందోళన చేపట్టగా స్పందించిన అధికారులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. మూసాపేట మండలంలోని నిజాలాపూర్‌లో వరి పంటనే అధికం. గత నెల రోజుల ముందు నుంచే వరి కోతలు ప్రారంభించారు. అందుకు ఏప్రిల్ 14వ తేదీన గ్రామంలో కొనుగోలు కేం ద్రాన్ని ప్రారంభించి అధికారులు చేతులు దులుపుకున్నా రు. అప్పుడు ఇప్పుడు అంటూ అధికారులు కొనుగోళ్లు ప్రారంభిచకపోవడంతో ఐదు రోజు కిందట రైతులంతా కలిసి తాసీల్దార్ కార్యాలయం ముట్టించడానికి సిద్ధమయ్యారు. దీంతో పొల్కంపల్లి సింగిల్‌విండో అధికారులు స్పందిస్తూ కొంత మంది హమాలీలను తీసుకొని గ్రామానికి వెళ్లి ప్రారంభిస్తున్నట్లు చెప్పడంతో రైతులు శాంతించారు. కానీ ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతున్నది.రో జురోజుకు వరి ధాన్యం పూర్తిగా ఒట్టిపోయి పడిపోతుందని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని, వర్షం వస్తే నష్టపోతామని ఆందోళన చేపడుతూ స్థానిక మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొంతమంది రైతులతో కలిసి తాసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అందుకు స్పందించిన తాసీల్దార్ రాజు మీరు కొనుగోలు కేంద్రం వద్దకే వెళ్లండి అక్కడికే అందరం వస్తామని చెప్పిపంపారు. దీంతో నిజాలాపూర్‌లోని వరి కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లారు. అక్కడికి డిప్యూటీ తాసీల్దార్ అంజనేయులు, ఏవో అనిల్‌కుమార్, ఏఈవో అనితా, సింగిల్‌విండో సీఈవో భాస్కర్‌గౌడ్ అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం సేకరణకు కుంటి సాకులు చెబుతూ ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని, అధికారులు ఉద్దేశ పూర్వకంగానే కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తూ నిలదీశారు.నెల రోజు కిందట కోతలు కోశామని, అప్పటి నుంచి తీవ్రమైన ఎండలు, మరో వైపు వర్షం వస్తుండడంతో నానా అవస్థలు పడుతూ ధాన్యాన్ని తూర్పు ఆరబెట్టామని, మండే ఎండలకు వేడి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వరి ధాన్యం పూర్తిగా ఎండిపోయి తూకం పూర్తిగా పడిపోయిందని చెప్పారు. మ్యాచర్ ఇప్పుడు 8.5శాతానికి పడిపోయిందని చెప్పారు. అయినా కొనుగోలు చేయకుండా ఇంకా మళ్లీ తూర్పు ఆరబెట్టమని చెప్తూ కాలయాపన చేస్తున్నారని, రైతులను మరింత నష్టం చేయడం కోసమే ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తూ నిలదీశారు. దీనిపై మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ మాట్లాడుతూ మీరు ఆలస్యం చేసే కొంది మ్యాచర్ పడిపోయి రైతులకు నష్టపోయి మిల్లర్లకు లబ్ధి జరుగుతుందని, ఒక సంచిలో 40కిలోలు వడ్లు సరిపోవాలి, కానీ సంచి సగం పోసినా సరిపోవడం లేదని, మరో వైపు 40 కిలోలకు బదులుగా 41 కిలో 200 గ్రాములు తీసుకుంటుండడంతో తీవ్రంగా నష్టం జరుగుతుందని వెంటనే కొనుగోలు చేయకపోతే రైతులమంతా కలిసి కలెక్టర్ వద్దకు వెళ్తామని చెప్పారు.అదేవిధంగా మాజీ ఎంపీటీసీ సీజీ గోవర్ధన్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, ఎ మ్మెల్యే జీఎంఆర్ సంబంధిత అధికారులను కూడా వెం టనే కొనుగోలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. సీఈవో భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ హామాలీలు లేరని, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు రావడం లేదని చెప్పుకోచ్చారు. అందుకు ఏవో మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వెంటనే కొనుగోళ్లు చేపడతామని చెప్పడంతో రైతులు శాంతించారు.

